సాక్షి విజయనగరం

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



పూర్తిస్థాయిలో మందుల సరఫరా

ప్రజారోగ్యానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలతో పాటు మందులు అందజేస్తోంది. - 8లో



ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి - 8లో

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు.



వ్యాన్ బోల్తా.. 25 మందికి గాయాలు

పెళ్లి చూపులకు వెళ్లివస్తుండగా వ్యాన్ బోల్తా పడడంతో 25 మంది గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా టెట్



రాజాం జీఎంఆర్ఐటీ పరీక్ష కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

రాజాం: రాజాం జీఎంఆర్ఐటీలో మంగళవారం నిర్వహించిన టెట్ పేపర్-1(ఎ) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. పరీక్షకు ఉదయం 235 మంది హాజరుకావాల్సి ఉండగా 180 మంది అభ్యర్థులు హాజరుకాగా, మధ్యాహ్నం 230 మందికి 205 మంది హాజరైనట్టు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పరీక్షల పరిశీలకులు యాగాటి దుర్గారావు, ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మార్చి 1న ఎస్.ఆర్ పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల ఆధీనంలో సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్) పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు మార్చి 1వ తేదీన ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు విజయనగరం ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని అప్లికేషన్, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సదుపాయం



సీహెచ్. అప్పలనారాయణ, డీపీటీఓ

విజయనగరం అర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి (డీపీటీఓ) సీహెచ్ అప్పలనారాయణ తెలిపారు. వచ్చే నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగబోయే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ నివాసం నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. విద్యార్థి తమ హాల్‌టికెట్‌ను చూపించి ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణాన్ని పొందవచ్చన్నారు.

వైద్య ఉద్యోగుల స్పందనకు 12 వినతులు



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి 12 వినతులు అందినట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గందరగోళం

- చీపురుపల్లి టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం
- కరివేపాకు అయిపోయిన కిమిడి నాగార్జున
- అధ్యక్షుడిగా జిల్లాలో పార్టీకి సేవచేసినా తప్పని వెన్నుపోటు
- మంత్రి బొత్సను ఎదుర్కోవడానికి పనికిరాడనే నెపం
- విడతకో నియోజకవర్గం మార్చేసే గంటా శ్రీనివాసరావును బలిపశువును చేసే యోచన
- చీపురుపల్లి నుంచి పోటీచేయాలని చంద్రబాబు పదేపదే ఒత్తిడి
- ఓడిపోయే టిక్కెట్ వద్దంటూ గంటా నిరాకరణ?
- తాజాగా తెరపైకి మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరు
- తాడేపల్లిలో చంద్రబాబు నివాసానికి నాగార్జున పరుగు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: తొలుత టీడీపీ... తర్వాత ప్రజారాజ్యం.. ఆ తర్వాత కాంగ్రెస్.. మళ్లీ టీడీపీ... స్థిరంగా ఒక నియోజకవర్గం లేదు. స్థిరంగా ఒక పార్టీలోనూ లేరు. ప్రజలను మభ్యపెట్టి గెలవాలి. తర్వాత ముఖం చాటేయాలి!. ఇదంతా చెబుతుంటే ఉత్తరాంధ్రలో ఠక్కున గుర్తుకొచ్చే ఏకైక వ్యక్తి... గంటా శ్రీనివాసరావు!. ఇప్పుడు ఆయనను విజయనగరం జిల్లాపై రుద్దేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పదే పదే ఒత్తిడి తెస్తున్నారు. ఎలాగోలా 'గంటా' బెడదను విదిల్చుకునేందుకు చూస్తున్నారు. అయితే, ఆయన చంద్రబాబు చెబితే వెళ్తానంటూనే.. ఓడిపోయే టిక్కెట్ వద్దంటూ మరోవైపు నిరాకరిస్తున్నారు. ఇన్నాళ్లూ టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ కోసం పనిచేసిన కిమిడి నాగార్జునకు వెన్నుపోటు తప్పలేదు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మంత్రి బొత్స సత్యనారాయణను ఢీ కొట్టాలంటే పనికిరాడంటూ ఓ ముద్రవేసి పక్కనపెట్టేశారు. గంటా చీపురుపల్లి పోనంటే ప్రత్యామ్నాయంగా విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరును టీడీపీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు తాడేపల్లిలో చంద్రబాబు నివాసం నుంచి పిలుపుతో కిమిడి నాగార్జున మంగళవారం హుటాహుటిన బయల్దేరివెళ్లారు. జిల్లాలో అత్యంత ప్రాధాన్యమైన చీపురుపల్లి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి అత్యంత గందరగోళంగా మారింది.

● ఇన్నాళ్లూ బాధ్యతలు మోసినా...

చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యనారాయణకు చాలా పట్టు ఉంది. గ్రామగ్రామాన ఆయన అనుచరగణం ఉంది. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ స్వగ్రామం చీపురుపల్లి కావడం, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మెరకముడిదాం మండలం నుంచి ఏకగ్రీవ జెడ్పీటీసీ కావడం అదనపు బలాలు. ప్రతి ఊరి నాయకులు తామే అభ్యర్థి అన్న భావంతో విజయానికి శ్రమిస్తారు. గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ చేతిలో భారీగా ఓట్ల తేడాతో కిమిడి నాగార్జున ఓటమి పాలయ్యారు. వేరే విధిలేని పరిస్థితుల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, చీపురుపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా ఆయనే ఇన్నాళ్లూ బాధ్యతలు చూస్తూ వచ్చారు. 2014 ఎన్నికల్లో పోటీచేయడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో చంద్రబాబు ఇటీవల ప్రకటించిన తొలి జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పనికిరాడని ఆ పార్టీ అధిష్ఠానం తేల్చి చెప్పకనే చెప్పడంతో ఆయన పూర్తి నైరాశ్యంలోకి వెళ్లిపోయారు.

దోలాయమానంలో నాగార్జున..

నలభై సంవత్సరాలు పార్టీ చరిత్ర, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, ఎర్ర బుక్‌లో అందరి పేర్లు రాస్తున్నా అని హెచ్చరించే లోకేశ్, వీరికి మద్దతుగా పవన్ కల్యాణ్... ఇంకేముంది 2024 ఎన్నికల్లో మేము హిట్ అనే భ్రమలో టీడీపీ క్యాడర్ ఇన్నాళ్లూ ఉంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. అందుకు చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితే అందుకు అద్దం పడుతోంది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున ఎక్కడున్నాడో తెలియదు. నాలుగు మండలాల్లో పార్టీ క్యాడర్ ఏమైందో, ఎక్కడుందో తెలియదు. పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ నెల 21న ఈనాడు పత్రికలో 'బొత్సకు పోటీగా గంటా' అనే శీర్షికన వచ్చిన వార్తతో నాగార్జున హతాశులయ్యారు. పార్టీ పగ్గాలు పూర్తిగా వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో అతనికి చంద్రబాబు నుంచి కబురు రావడంతో తాడేపల్లికి బయల్దేరి వెళ్లారు.

మీసాల గీత పేరు పరిశీలన...

గంటాను పంపుతున్నారని తెలిసినప్పటి నుంచి చీపురుపల్లి టీడీపీ క్యాడర్ తీవ్ర అసహనంలో ఉంది. స్థానికంగా తమకు అందుబాటులో ఉండే నేత కావాలని, ఎన్నికల తరువాత ముఖం చాటేసే నాయకులు వద్దని కోరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరు తెరపైకి వచ్చింది. ఆమెకు టిక్కెట్ ఇస్తే ఎలా ఉంటుందని నెల రోజుల కిందటే ఐవీఆర్ఎస్ ద్వారా టీడీపీ శ్రేణుల అభిప్రాయాన్ని చంద్రబాబు సేకరించారు. అంతేకాకుండా ఇటీవల శంఖారావం సభ కోసం చీపురుపల్లి వచ్చిన నారా లోకేశ్‌ను మీసాల గీత కలవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

గంటా గెంటివేతకు యత్నాలు...

నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ వైఎస్సార్‌సీపీ మరింత బలపడింది. తన ఓటుబ్యాంకును పటిష్ఠం చేసుకుంది. దీనికితోడు ప్రజలతో నిత్యం మమేకమయ్యే మంత్రి బొత్స సత్యనారాయణను ఢీ కొట్టాలంటే నాగార్జున సహా జిల్లాలోని టీడీపీ నేతలెవరూ సరిపోరని ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచిస్తోంది. పొరుగు జిల్లాకు చెందిన గంటా శ్రీనివాసరావును ఇక్కడకు పంపాలని, తద్వారా విశాఖ జిల్లా నుంచి గెంటివేయాలనే యోచనలో ఉన్నట్టు ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. తనకు చీపురుపల్లి టిక్కెట్ వద్దని, నెల్లిమర్ల కానీ, భీమిలి కానీ ఇవ్వాలని గంటా కోరుతున్నారు. నెల్లిమర్ల టిక్కెట్ ఇప్పటికే జనసేన అభ్యర్థి లోకం మాధవికి పవన్ కల్యాణ్ ప్రకటించేయడంతో ఇక అక్కడ కుదిరే పరిస్థితి లేదు. భీమిలి కూడా ఇవ్వలేని పక్షంగా మళ్లీ తన పాత స్థానం చోడవరం టిక్కెట్ అయినా ఇవ్వాలని గంటా కోరుతున్నట్లు తెలిసింది.

సంధ్యారాణి కుల నిరూపణకు హైకోర్టును ఆశ్రయిస్తాం

- రేగు మహేశ్వరరావు



సాలూరు: టీడీపీ సాలూరు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన గుమ్మడి సంధ్యారాణి ఎస్టీ కాదని, ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తామని న్యాయవాది, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు స్పష్టం చేశారు. సాలూరు పట్టణంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. సంధ్యారాణి కులవివాదంపై ఆదివాసీ వికాస పరిషత్ సంఘం నాయకులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ఆమె కుల వివాదంపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆమె రాజకీయనాయకురాలు కావడం, రాజకీయ ఒత్తిళ్లతో సరిగా దర్యాప్తు జరగలేదని ఆరోపించారు. ఈ క్రమంలో ఆమె కుల వివాదంపై దర్యాప్తు చేయాలని కోరుతూ తాము హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. మక్కువ మండలం మరిపివలస గ్రామం, కొప్పలవెలమ కులానికి చెందిన అమరాపు సిమిడినాయుడు, పార్వతమ్మల కుమార్తె సంధ్యారాణి అని పేర్కొన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే జన్ని ముత్యాలుగా పేర్కొంటూ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం పొంది చలామణి అవుతున్నారని ఆరోపించారు. సంధ్యారాణి తల్లి పార్వతమ్మ, మాజీ ఎమ్మెల్యే జన్ని ముత్యాలును రెండో వివాహం చేసుకుందని ఆమె చెబుతున్న వాదన సరైనదే అయినా.. ఆమె ఎస్టీ కులధ్రువీకరణ పత్రం కేవలం విద్యకు మాత్రమే పరిమితమవుతుందన్నారు. మిగిలిన పదవులు, ఉద్యోగాలకు వర్తించదన్నారు. దీనిపై డీఎల్‌సీ కమిటీతో పూర్తిస్థాయి విచారణ జరిగేలా ఆదేశాలు జారీచేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. విజయనగరం కలెక్టర్ 2008లో ఓ కేసుకు సంబంధించి తండ్రి ఎస్టీ గదబ అయినప్పటికీ, తల్లి ఓసీ బ్రాహ్మణ అయినందున భార్య, ఆమె పిల్లలు ఎస్టీ గదబ ఆచార వ్యవహారాలు ఆచరించనందున, పిల్లలు ఎస్టీలుగా పరిగణించడానికి వీల్లేదని తీర్పునిచ్చారని గుర్తుచేశారు.

రేషన్ లబ్ధిదారులకు రాగి పిండి పంపిణీ

- మార్చి నెల నుంచే అమలు
- 5.85 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి



రాగి పిండి ప్యాకెట్

విజయనగరం అర్బన్: రేషన్ లబ్ధిదారులకు శుభవార్త. పేద ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆరోగ్యకర ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రోటీన్స్ పుష్టిగా ఉన్న ఫోర్టిఫైడ్ బియ్యం, గోధుములు పంపిణీ చేస్తోంది. తాజాగా వచ్చేనెల నుంచి రాగి పిండి పంపిణీకి సర్వం సిద్ధం చేసింది. ప్రోటీన్స్ కలిపిన రాగులను పిండిగా మార్చి ప్యాకెట్ రూపంలో కార్డుదారుకు కిలో రూ.11కు అందజేయనుంది. రాగి పిండిలో ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి సూక్ష్మ పోషకాలు ఉంటాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ 2006 నిర్దేశిత ప్రమాణాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్టు ప్రజా పంపిణీ వ్యవస్థ అధికారులు తెలిపారు. ముందుగా పల్లెప్రాంత ప్రజలకు, తర్వాత పట్టణ ప్రజలకు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జిల్లాలోని 5,85,401 మంది తెలుపు రేషన్ కార్డుదారులకు రాగిపిండి అందజేస్తామని జేసీ కే.కార్తీకేయ తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా సాగేలా చూడాలని వలంటీర్లను ఆదేశించారు.

రైతన్నకు పెట్టుబడి సాయం

- నేడు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధుల విడుదల

విజయనగరం ఫోర్ట్/బొబ్బిలి: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ఐదో సంవత్సరం మూడో విడత నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేయనుందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. ప్రభుత్వం ఏటా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద రూ.13,500 సాయాన్ని మూడు విడతలుగా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. మొదటి విడతలో రూ.7,500, రెండో విడతలో రూ.4వేలు, మూడోవిడతగా రూ.2 వేలు చొప్పున అందజేస్తున్నట్టు తెలిపారు. 2,63,414 మంది రైతులకు రూ.52.73 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్టు వెల్లడించారు. సాధారణ రైతులు 2,59,519 మందికి రూ.51.90 కోట్లు, అటవీభూమి సాగుదారులు 1110 మందికి 0.222 కోట్లు, భూమి లేని సాగుదారులు 2,785 మందికి 0.61 కోట్లు జమచేస్తారని చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకానికి సంబంధించి 17-11-2020 నుంచి 28-02-2024 వరకు 46,460 మంది రైతుల ఖాతాల్లో రూ.8.89 కోట్లు జమచేస్తారన్నారు.

ఖరీఫ్‌లో రూ.6.69 కోట్లు...

జిల్లాలో 2022 సంవత్సరానికి సంబంధించి పంట కాలానికి రైతులు తీసుకున్న రుణాలకు రూ.6,69,82,558ల వడ్డీ సొమ్మును రైతులకు రాయితీగా ప్రభుత్వం అందజేయనుంది. మొత్తం 33,769 మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

2021–22లో రబీ కాలానికి రూ.2.19కోట్లు..

రబీ సీజన్ 2021–22 సంవత్సరంలో 12,691 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. వీరి రుణాలకు అయిన వడ్డీ రూ. 2,19,60,248లను ప్రభుత్వం భరిస్తోంది. ఈ మేరకు ఈ నిధులను రైతులు రుణాలు తీసుకున్న బ్యాంకు ఖాతాల్లో జమచేయనుంది.

రబీ, ఖరీఫ్ సీజన్‌ల వడ్డీ రాయితీ ఒకేసారి చెల్లింపు..

జిల్లాలోని రైతులు రెండు దఫాలుగా రుణాలు తీసుకుంటారు. ఖరీఫ్‌లో సాగు కోసం ఒకసారి, అనంతరం వచ్చే రబీ పంటకాలానికి మరోసారి పంట రుణాలను వివిధ బ్యాంకుల్లో వారి భూ విస్తీర్ణం ఆధారంగా తీసుకుంటారు. రుణాలు తిరిగి చెల్లిస్తారు. నిర్ణీత కాలంలో రుణాలు చెల్లించిన రైతులందరికీ ప్రభుత్వం వడ్డీ రాయితీని వర్తింపజేస్తోంది. వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తోంది.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం అత్యంత శ్రద్ధచూపుతోందని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వసతిగృహ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. విద్య, వసతిగృహ నిర్వహణ తదితర అంశాలపై గిరిమిత్ర సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అనారోగ్యానికి గురయ్యే విద్యార్థులను ఇళ్లకు పంపరాదని ఆదేశించారు. ఆరోగ్య సంరక్షణపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యాధికారులు, వసతిగృహాల సిబ్బంది సమన్వయంతో సాగాలని సూచించారు. వసతిగృహ విద్యార్థులు దేశంలో నిర్వహించే విద్యా, ఉద్యోగ పోటీ పరీక్షల్లో రాణించాలని, అందుకు తగిన తర్ఫీదు ఇవ్వడంలో ఆసక్తి ఉండాలన్నారు.

స్టడీ అవర్స్ నిర్వహించడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పదోతరగతి పరీక్షలు, అనంతరం వచ్చే పాలిటెక్నిక్ గురుకులాలు, తదితర పరీక్షల గూర్చి తెలియజేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఎం.రుక్మాందరరావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి బొత్స పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. నగరంలోని తన నివాసానికి చేరుకొని 10 గంటలకు సెంచూరియన్ యూనివర్సిటీలో జరిగే రైతు సమ్మేళనంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు గరివిడి మండలంలోని దువ్వాం గ్రామ సచివాలయ భవనాన్ని, మధ్యాహ్నం 4.30 గంటలకు దేవాడ గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్ర భవనాలను ప్రారంభిస్తారు. సాయంత్రం విశాఖ చేరుకొని హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు. తిరిగి 29న జిల్లాకు వచ్చి ఆ రోజు మధ్యాహ్నం గుర్ల మండలం చింతపల్లిపేట సచివాయ భవనాన్ని, సాయంత్రం 5 గంటలకు పాలవలసలో గ్రామ సచివాయలం, ఆరోగ్యకేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. రాత్రి విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు.

అబ్బురపరిచే ఆవిష్కరణలు

- జేఎన్‌టీయూ జీవీలో ఆకట్టుకున్న ఎక్స్‌పో
- ఆలోచనలను ప్రాజెక్టులుగా తీర్చిద్దిన విద్యార్థులు

విజయనగరం అర్బన్: విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా, ఇంజినీరింగ్ నిపుణులుగా తీర్చిదిద్దాలన్న ప్రధాన ఉద్దేశంతో జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగం రెండురోజుల పాటు సైన్స్ ఎక్స్‌పో నిర్వహించింది. విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరణల రూపంలో ప్రదర్శించేందుకు చక్కని వేదిక ఏర్పాటుచేసింది. ఇక్కడ వర్సిటీ పరిధిలోని 10 కళాశాలలకు చెందిన విద్యార్థులు 37 వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. కొత్తకొత్త ఆవిష్కరణలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక స్ఫూర్తిని పెంపొందించారు.

● సోలార్ పవర్ ఆగ్రోరోవర్



సోలార్ పవర్ ఆగ్రోరోవర్ పనితీరును వివరిస్తున్న రూపకర్తలు

వ్యవసాయ రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా రూపొందించిన సాంకేతిక పరికరం సోలార్ ఆగ్రోరోవర్. ఆనందపురం మండలం సొంత్యాం ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎ.జ్యోత్స్న, మహమ్మద్ అద్నాన్, సీహెచ్. యశ్వంత్, కె.కృష్ణ దీనిని రూపొందించారు. పొలాన్ని దుక్కిచేయడం, విత్తనాలు జల్లడం, కలుపుమొక్కలు తీయడం, చేనుకోయడం వరకు అన్ని పనుల్లోనూ రైతులకు అనువైన పరికరం ఇది. డ్రైవర్ లేకుండా సెల్ నుంచి రిమోట్ కంట్రోల్‌తో ఆపరేటింగ్ చేయొచ్చు. విద్యుత్‌ను సోలార్ ప్యానల్ ద్వారా తక్కువ వ్యయంతో అందించేలా దీనిని రూపొందించారు.

● సోలార్ చార్జింగ్ మూవబుల్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్



సోలార్ చార్జింగ్ మూవబుల్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్ పరికరం

జర్నీలో ఎలక్ట్రికల్ చార్జింగ్ అవసరాలను తీర్చే ప్రాజెక్టు 'సోలార్ చార్జింగ్ మూవబుల్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్'. మొబైల్స్ నుంచి ఎలక్ట్రికల్ వాహనాల వరకు అవసరమైన ఎలక్ట్రికల్ చార్జింగ్‌ను ఇది ఇస్తుంది. కేవలం రూ.7వేల వ్యయంతోనే ఈ పరికరాన్ని లెండీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎస్.విష్ణువర్ధన్, యు.తేజశ్వని, పి.సాయికిరణ్, వి.దినేష్‌కుమార్ రూపొందించారు.



ఏఐ యాప్‌లో కేన్సర్ కారకాలను గుర్తించడాన్ని వివరిస్తున్న విద్యార్థిని

● స్కిన్ కేన్సర్ డిటెక్షన్ విత్ వైఓఎల్ఓ

మానవ శరీరంలోని కేన్సర్ కారకాలను గుర్తించే నూతన ప్రాజెక్టు ఇది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా పనిచేసే ఈ పరికరంతో కేన్సర్ కారకాలను సులభంగా గుర్తించవచ్చు. స్కిన్ భాగాన్ని ఫొటో తీసి దానిని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో స్కాన్ చేయాలి. యాప్‌లో ఉన్న దాదాపు 3 వేల రకాల కేన్సర్ వ్యాధుల లక్షణాలతో పోల్చుతుంది. ఈ విధంగా ఖర్చులేకుండా కేన్సర్ వ్యాధి కారకాన్ని తెలుసుకోవచ్చు. దీనిని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు మహతా చోప్రా, ఎల్.ఆర్.వినయ్‌కుమార్, వి.వైకుంఠవాసు, కె.సింధుజ రూపొందించారు. ఇది వైద్యరంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలకనుంది.

● ఎలక్ట్రిక్ షాక్ స్టిక్

మహిళల రక్షణకు అవసరమైన ఎలక్ట్రిక్ షాక్ స్టిక్ ఇది. పాకెట్‌లో పెట్టుకొనే సైజ్‌లో ఉంటుంది. ఒంటరి మహిళ ప్రయాణంలో రక్షణగా ఉంటుంది. ఎదుట వ్యక్తికి తెలియకుండా విద్యుత్ షాక్ ఇచ్చేయవచ్చు. ఎదురుదాడిలో ఎక్కువ మంది ఉన్నపుడు స్టిక్‌కి ఉన్న స్విచ్ ఆన్‌చేస్తే స్విచ్‌కి ముందుగా అనుసంధానం చేసిన ఫోన్ నంబర్లకు మెసేజ్ వెళ్తుంది. దీనిని విశాఖపట్నం గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జి.లోకేశ్, పి.మాధవ్‌కృష్ణ, కె.సుజిత్ సూర్య, జావేద్ ఖాన్ రూపొందించారు.



ఎలక్ట్రిక్ షాక్ స్టిక్ వినియోగాన్ని వివరిస్తున్న రూపకర్తలు

క్లుప్తంగా

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద మంగళవారం టాటాఏస్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గరికివలసకు చెందిన కనిమెరక సన్యాసప్పలనాయుడు (48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగానే పని ముగించుకుని గరికివలస వెళ్లడానికి సొలిపిసోమరాజు పేట జంక్షన్‌లో వేచి ఉన్నాడు. రోడ్డు పక్కన నిల్చున్న సన్యాసప్పలనాయుడిని చీపురుపల్లి నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై భాస్కరరావు చెప్పారు.

140 లీటర్ల సారాతో ఐదుగురి అరెస్ట్



పట్టుబడిన సారా క్యాన్లు, నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

పాలకొండ రూరల్: సీతంపేట మండలం నారాయణ గూడ నుంచి బందమాను గూడ మీదుగా పాలకొండ మండలానికి కావిళ్లతో 140 లీటర్ల సారాను తరలిస్తున్న ఐదుగురు నిందితులను ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ప్రత్యేక విభాగం సీఐ జి.శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఎస్‌ఈబీ అధికారులతో కలిసి రూట్ వాచ్ నిర్వహిస్తున్న క్రమంలో సీతంపేట మండలానికి చెందిన నిందితులు సారాతో పట్టుబడ్డారు. తొలుత వారిని ఎస్‌ఈబీ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు. రూట్ వాచ్‌లో ఎస్‌ఈబీ ఎస్సైలు బి.చల్లంనాయుడు, బి.చంద్రశేఖర్‌రాజు, సిబ్బంది ఉపేంద్రకుమార్, పఠాన్ ఇమాన్, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

చోరీకేసులో నిందితులకు రిమాండ్

విజయనగరం క్రైమ్: ఓఎల్‌ఎక్స్‌లో సెల్ ఫోన్ కొంటామని చెప్పి, అక్కడికి ఫోన్‌లు పట్టుకు వచ్చిన వారిని చితక్కొట్టి రెండు సెల్ ఫోన్‌లు, రూ.7వేలు నగదు దోచుకున్నట్లు బాధితులు ఈ నెల 15న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు విసినిగిరి కుమార్ అలియాస్ సూర్య, సోము నవీన్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి నుంచి రెండు సెల్ ఫోన్‌లు, రూ. 2వేలు నగదు రికవరీ చేశారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

దుకాణాల ఆకస్మిక తనిఖీ



కెల్లలో కేసు నమోదు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి దామోదర నాయుడు

గుర్ల: మండలంలోని కెల్ల, వల్లాపురం, బెల్లాన పేటలోని వ్యాపార దుకాణాలను లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం. దామోదర నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిరాణా, చికెన్, కూరగాయల షాపులు తనిఖీ చేసి సీళ్లు లేని కాటాలను గుర్తించారు. సీళ్లు లేకుండా అమ్మకాలు జరుపుతున్న షాపు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని మూడు గ్రామాల్లో ఆరు కేసులు నమోదు చేశామని చెప్పారు. కేసులు నమోదు చేసిన వారిలో టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పూర్తిస్థాయిలో మందుల సరఫరా

- తీరిన రోగుల ఇబ్బందులు
- ఆస్పత్రులకు బడ్జెట్ భారీగా పెంచిన ప్రభుత్వం
- గతంలో ఏడాదికి రూ.1.72 కోట్ల బడ్జెట్
- ప్రస్తుతం రూ.17.21 కోట్లకు పెంచిన ప్రభుత్వం



సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో నిల్వ ఉన్న మందుల బాక్సులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మందుల కోసం క్యూలో ఉన్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్యానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాడు-నేడు ద్వారా ఆస్పత్రుల రూపు రేఖలు మార్చేసింది. అంతేకాకుండా అవసరమైన వైద్య పరికరాలు కూడా సమకూర్చింది. దీంతో రోగులకు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వ్యాధి నివారణలో మందులు చాలా ప్రధానం. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన వారే. ఈనేపథ్యంలో వారికి అన్ని రకాల మందులు పూర్తి స్థాయిలో అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల వివరాలు:
ఉమ్మడి విజయనగరం జిల్లాలో 68 పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)లు, 20 యూపీహెచ్‌సీ(పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)లు, ప్రాంతీయ ఆస్పత్రులు-3, సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)లు-8, జిల్లా ఆస్పత్రి ఒకటి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. వీటికి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మౌలిక సదుపాయల సంస్థ(ఏపీఎంఎస్‌ఐడీసీ) సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా చేస్తుంది.

భారీగా పెరిగిన బడ్జెట్
ప్రభుత్వ ఆస్పత్రులకు ఇచ్చే మందుల బడ్జెట్‌ను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం భారీగా పెంచింది. గత టీడీతపీ ప్రభుత్వ హయాంలో రోగులకు అరకొరగా మందులు మాత్రమే అందేవి. కానీ ప్రస్తుతం రోగులకు పూర్తి స్థాయిలో మందులు అందజేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి మందుల బడ్జెట్ రూ.1.72 కోట్లు ఉంటే ప్రస్తుత ప్రభుత్వం ఏడాదికి రూ. 17.21 కోట్లు కేటాయిస్తోంది. అదేవిధంగా సర్జికల్ బడ్జెట్ టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.52 లక్షలు ఉంటే ప్రస్తుత ప్రభుత్వం సర్జికల్ బడ్జెట్‌ను రూ.5 కోట్లకు పెంచింది.

> **అందుబాటులో అన్ని రకాల మందులు**
>
> ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేసే మందుల బడ్జెట్‌ను ప్రభుత్వం భారీగా పెంచింది. దీని వల్ల అన్ని రకాల మందులు రోగులకు పూర్తి స్థాయిలో అందించగలుగుతున్నాం. అదేవిధంగా సర్జికల్ మెటీరియల్స్ కూడా పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నాం.
>
> - బి. సన్యాసినాయుడు సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జ్

1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం

- మైక్రో ఇరిగేషన్ శాఖ డీడీ లక్ష్మీనారాయణ



రామభద్రపురం: రొంపల్లిలో రైతులు అమర్చిన బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న మైక్రో ఇరికిగేషన్ శాఖ డీడీ లక్ష్మీనారాయణ



తెర్లాం: అంట్లవారలో సాగుచేస్తున్న ఆయిల్ పామ్ పాయిల్ తోటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

రామభద్రపురం/తెర్లాం: ఈ ఏడాది విజయనగరం జిల్లాలో 1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టేందుకు రూ.6.80 కోట్లతో రాయితీపై పరికరాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ డీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని రొంపల్లి, ఎస్ సీతారాంపురం, తెర్లాం మండలంలోని అంట్లవార గ్రామంలో ఆయన పర్యటించి రైతులకు బిందు సేద్యానికి రాయితీపై అందించిన పరికరాలను మంగళవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టగా ఆయా పరికరాలకు ప్రభుత్వం రూ.3.80 కోట్లు ఇవ్వగా రూ.2.09 కోట్లు రాయితీ ఇచ్చిందన్నారు.అన్ని వర్గాల చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో పరికరాలను అందిసామని తెలిపారు. వేరుశనగ, నువ్వులు, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, ఆకుకూరలు తుంపర్ల సేద్యానికి అనువైన పంటలని చెప్పారు. మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, సపోటా, జామ, చెరుకు, పత్తి,మల్బరి, కూరగాయలు కూడా బిందు సేద్యానికి అనువైన పంటలన్నారు. ఈ పథకాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. నియమావళి అమలులో ఏమాత్రం ఉపేక్షించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌ఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, పోలీసు అధికారులు ఇతర ముఖ్య సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడం శిరోధార్యమని పేర్కొన్నారు. నిబంధనలను ఏమాత్రం ఉల్లంఘించినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గరనుంచి సిబ్బంది అంతా భారత ఎన్నికల సంఘం ఆధీనంలోనే పనిచేస్తారని చెప్పారు. కమిషన్ ఇచ్చిన నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏమైనా సందేహాలు తలెత్తితే కాల్‌సెంటర్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి బృందం వీడియో గ్రాఫర్‌ను నియమించి సరైన పద్ధతిలో వీడియో రికార్డ్ చేయించాలని చెప్పారు. కచ్చితంగా శిక్షణ పడే విధంగా, పూర్తి ఆధారాలతో కేసులను నమోదు చేయాలని ఆదేశించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో నిర్లిప్తత విడనాడాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా, ఎన్నికల కమిషన్ నుంచి కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ, ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే నిబంధనలు, ఆదేశాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అమలు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎంసీసీ నోడల్ ఆఫీసర్ బి.అరుణశ్రీ, వ్యయానికి సంబంధించి ఎక్స్‌పెండిచర్, వివిధ అంశాలపై నోడల్ ఆఫీసర్ అరుణకుమారి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమాన్ని ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ ఎం.సుధాకరరావు సమన్వయపరిచారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, డీఆర్‌ఓ ఎస్డీ అనిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మడ్డువలస పరిసరాల్లో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

వంగర: మండల పరిధి మడ్డువలస గ్రామ సమీపంలో వంతెనను ఆనుకుని మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మడ్డువలస ప్రాజెక్టు కిందిభాగంలో గల సంగాం, మగ్గూరు గ్రామాల ఏటిబాడవ పొలాలకు మంటలు అంటుకున్నాయి. 800 మీటర్ల దూరంలో నదిఒడ్డున గల జంగిల్ కాలిబూడిదైంది. అదే విధంగా సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన పలువురు రైతుల నీటి ఇంజిన్లు, సాగునీటి పైపులు కాలిబూడిదయ్యాయి. చెరకు పంటకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఈ సమాచారం తెలుసుకున్న రాజాం అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సకాలంలో మంటలు అదుపులోకి తీసుకురావడంతో విద్యుత్ లైన్లకు నష్టం తప్పిందని ఏఈ కె.వినయ్‌కుమార్ తెలిపారు. నష్టం వాటిల్లిన రైతులను ఆదుకోవాలని మగ్గూరు, సంగాం సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, గేదెల వెంకటనాయుడులు కోరారు.

మెగా జాబ్ మేళా రేపు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 14 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ, డిప్లమో, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్‌ఏపీఎస్‌ఎస్‌డీసీడాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29న ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని ఆ సమయానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9010023033, 7286042743 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

మృతుని కుటుంబానికి పరిహారం



పరిహారం చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందచేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, హరిత రహదారి సిబ్బంది

బొండపల్లి: హరిత రహదారి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయిన బొండపల్లి మండలంలోని జీపీ అగ్రహారం గ్రామానికి చెందిన చప్పా కృష్ణ కుటుంబానికి నష్టపరిహారం చెక్కును ఎంపీపీ చల్లా చలం నాయుడు మంగళవారం అందజేశారు. మృతుని కుటుంబానికి పరిహారం విషయమై హరిత రహదారి యాజమాన్యంతో ఎంపీపీ చల్లా చలం నాయుడు మాట్లాడి న్యాయం చేయాలని కోరగా రూ.11 లక్షలు పరిహారం అందించడానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు పరిహారం చెక్కును మృతుని భార్య నారాయణమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కోశాధికారి సిరిపురం నాయుడు బాబు, హరిత రహదారి క్యాంపు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా.. 25 మందికి గాయాలు



పీహెచ్‌సీలో క్షతగాత్రులు

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ విజయరామపురం గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా, వ్యాన్ బోల్తా పడడంతో సుమారు 25 మంది గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం కొదమ గ్రామంలో పెళ్లిచూపులకు సుమారు 40 మంది గిరిజనులు విజయరామపురం గ్రామం నుంచి వ్యాన్‌లో వెళ్లారు. పెళ్లిచూపులు ముగించుకుని గ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో సాలూరు మండలం మోనంగిగ్రామం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే గిరిజనులు 108కు సమాచారం అందించారు. 108 వచ్చేలోపు గాయపడిన పలువురిని ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో శంబర పీహెచ్‌సీకి తరలించారు. మిగిలిన వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. సుబ్బారావు, మోహన్, శ్రీదేవి తీవ్రగాయాల పాలవడంతో మెరుగైన చికిత్స కోసం 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.

బైక్, ఆటో ఢీకొని ముగ్గురికి..



ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

పాలకొండ రూరల్: పాలకొండ-సీతంపేట ప్రధాన రహదారిలో సిరికొండ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలం లుంబూరు గ్రామానికి చెందిన బి.ఉపేంద్ర, వి.మోహన్ కుమార్, ఎస్.సాయి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొన్నారు. దీంతో స్థానికులు ప్రమాదాన్ని గమనించి ఉపేంద్రకు తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదంపై ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పూరిల్లు, పశువుల పాక దగ్ధం



అగ్ని ప్రమాదంలో మృతి చెందిన మేకలు



దగ్ధమైన పశువుల పాక

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లుతో పాటు పశువుల పాక పూర్తిగా దగ్ధమై సుమారు రూ.90 వేల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలాలా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉంటున్న కల్లు గీత కార్మికుడు రమేష్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, పక్కనున్న పశువుల శాలతో పాటు, గడ్డి వాముకు వ్యాపించాయి. మంటలు చెలరేగిన విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకి వచ్చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.30 వేల నగదు, రూ.60 వేలు విలువ చేసే నాలుగు మేకలు కాలిపోయాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. విజయవాడలో ఉన్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుకు ప్రమాద విషయం తెలియడంతో వెంటనే గ్రామ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

పీఎం విశ్వకర్మ పథకం సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విజయనగరం రూరల్: చేతివృత్తిదారులంతా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ పథకంలో భాగంగా శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, ఆర్థిక ఆసరా పొందాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన కేసలి అప్పారావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం వేలాది మంది వలస బాట పడుతున్నారని, విశ్వకర్మ వంటి పథకాలతో చేతివృత్తుల అభివృద్ధి ద్వారా స్థానికంగానే ఉపాధి పొంది, తద్వారా వలసలను అరికట్టవచ్చన్నారు. జిల్లా పరిశ్రమల అభివృద్ధి సంస్థ జీఎం పాపారావు మాట్లాడుతూ చేతివృత్తిదారులు నూతన ప్రయత్నాలను ప్రారంభించాలని, ఈ పథకం కేవలం చేతివృత్తిదారుల కుటుంబాల ఆర్థిక ఉన్నతికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం రూపొందించిందని చెప్పారు. ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్, పీఎం విశ్వకర్మ నోడల్ అధికారి అప్పికొండ శ్రీను మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. ప్రతి లబ్ధిదారు సీఎస్‌సీ ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.గోవిందరావు మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడగలమన్నారు. కార్యక్రమంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) జిల్లా ప్రధాన అధికారి సీహెచ్.కోటేశ్వరరావు, ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ రైతులకు వారంలోగా బకాయిల చెల్లింపు

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను కోరుతున్న రైతులు (ఫైల్)

సాలూరు: మండలంలోని జనవరివలస ఏపీ సీడ్స్ సంస్థ నుంచి బకాయి సొమ్ము రావాల్సిన రైతులకు ఈ వారంలో చెల్లింపులు జరుగుతాయని ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాక్షితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 23న నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు తన దగ్గరకు వచ్చి ఏపీ సీడ్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ధాన్యం ఇచ్చి నెలలు దాటుతున్నా సొమ్ము అకౌంట్‌లో జమకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారన్నారు. బకాయి సొమ్ము చెల్లింపులు జరిగేలా చొరవ తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దీంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి చెల్లింపులు తక్షణమే జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు ఏపీ సీడ్స్ ఎం.డి ఈ విషయాన్ని ధ్రువీకరించారన్నారు.